క్లుప్తంగా

ముమ్మరంగా కందులు కొనుగోలు

శావల్యాపురం: మండలంలోని అన్నీ రైతుభరోసా కేంద్రంలో కందుల కొనుగోలు ముమ్మరంగా చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ తెలిపారు. సోమవారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ మండలంలో అన్నీ గ్రామాల్లో ఖరీఫ్ సీజనులో 1409 ఎకరాలు రైతులు సాగు చేయగా ఒక్కో ఎకరానికి 5 నుంచి 6 క్వింటాల వరకు దిగుబడులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 256 మెట్రిక్ టన్నులు కందులు కొనుగోలు చేశామన్నారు. నాఫెడ్ క్వింటా మద్దతు ధర రూ.9729 రూపాయలు కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులకు సంబంధించి గోనె సంచులు, కూలీ రవాణా చార్జీలు క్వింటాకు రూ. 74 రూపాయలకు ప్రభుత్వం భరిస్తుందన్నారు. మార్కెటింగ్ ప్రమాణాలు మేరకు కొనుగోలు పారదర్శకంగా చేస్తున్నట్లు చెప్పారు. కందులు అమ్మిన రైతులకు నాలుగు రోజుల వ్యవధిలో నగదు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. రైతులు పండించిన కంది పంట చివరి గింజ వరకు రైతుభరోసా కేంద్రాలు ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. రైతులు దళారుల నుంచి మోసపోకుండా ఉండటానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈఅవకాశాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హోంగార్డులకు పోలీసు శాఖ అండగా ఉంటుంది

జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి



నరసరావుపేట: నిబద్ధతతో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన హోంగార్డులకు పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పదవి విరమణ పొందిన హోంగార్డు ఎస్ వి శ్రీనివాసరావుని ఘనంగా సన్మానించి జిల్లా పోలీసుల తరపున బహుమతి అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 1996 నుంచి హోంగార్డు విధులలో ప్రవేశించి పల్నాడు యూనిట్‌లో 28 ఏళ్లపాటు విశేష సేవలు అందించాడన్నారు. ఎలాంటి సమస్య వచ్చిన తనను నేరుగా సంప్రదించి తెలపవచ్చునని సూచించారు. సేవింగ్స్ ఇతర బెనిఫిట్స్ త్వరగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, హోంగార్డు ఆర్ ఐ ఎస్ కృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణా మద్యం విక్రయిస్తున్న ఇరువురి అరెస్టు



చిలకలూరిపేట: తెలంగాణా మద్యం అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న ఇరువురిని సెబ్ అధికారులు సోమవారం అరెస్టు చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో సోమ వారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్ఈబీ ఎస్ఐ వి.శశికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గోవిందపురం గ్రామానికి చెందిన కోటా రాజేష్ తెలంగాణా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి 12 ఫుల్‌బాటిళ్ల తెలంగాణా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఇతని ద్వారా నరసరావుపేట పట్టణానికి చెందిన దిలీప్ కుమార్ మద్యం విక్రయాలు చేస్తున్నట్లు తెలుసుకొని అతని ఇంటిపై దాడి చేసి మరో 52 ఫుల్‌బాటిళ్ల తెలంగాణా మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇరువురిని అరెస్టు చేశారు. మొత్తం 64 మద్యం బాటిళ్ల విలువ రూ. 70 వేలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సిబ్బంది చైతన్య, రవిబాబు, నాగరాజు, దిలీప్‌రెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబు కక్షకు పరాకాష్ట ఇదే

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు

శావల్యాపురం: వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు కక్షకు పరాకాష్ట చేరటం చాలా దుర్మార్గమని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ భీమని అంకారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అంకారావు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించటంలో దేశానికి ఆదర్శకంగా నిలిచిన వలంటీర్ల వ్యవస్థపై టీడీపీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు విషం కక్కడం సిగ్గుచేటన్నారు. ప్రతినెలా 1వ తేదీన తెల్లవారుజామున నేరుగా అవ్వా తాతలు ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్లపై నీచమైన రాజకీయం చేయటం హేయమైన చర్య అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీని భూస్థాపితం చేయటం ఖాయమన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు సేవలు వలన ఏంతోమంది ప్రాణాలను సైతం రక్షించి వారికి మెరుగైన వైద్యసేవలు సకాలంలో అందించిన ఘనత వలంటీర్లకే దక్కుతుందన్నారు. వలంటీర్లపై విషం కక్కడాన్ని టీడీపీ నాయకులు, దుర్మార్గపు తీరును ప్రజలు గమనించుతున్నారన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు పోతురాజు, మైనార్టీ సంఘం అధ్యక్షులు దూదెకుల పెద మదార్, మండల కో ఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, గ్రామపార్టీ అధ్యక్షులు దేవనబోయిన వీరనారాయణ ఉన్నారు.

పెత్తందార్లకు కనువిప్పు కావాలి మీ ఓటు

- ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కె.శివనాగ మనోహర్ నాయుడు
- యడ్లపాడు మండలంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం ప్రారంభం



ప్రచారంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యరి మనోహర్ నాయుడు

యడ్లపాడు: జగనన్న ప్రభుత్వంలో మేలు జరిగిన పేదలంతా తమ పవిత్ర ఓటుతో దీవించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పి అనిల్‌కుమార్‌యాదవ్, కావటి మనోహర్ నాయుడు కోరారు. యడ్లపాడు మండలంలో ఎన్నికల ప్రచారాన్ని సోమవారం కావటి మనోహర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముందుగా బోయపాలెం శ్రీపార్వతిదేవి ఆలయంలో ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌తో కలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోటీ అభ్యర్థుల్ని బోయపాలెం సర్పంచ్, గుడి ధర్మకర్త వడ్డేపల్లి నరసింహరాజు ఆధ్వర్యంలో అమ్మవారి వస్త్రాలతో అర్చకులు ఆశీర్వదించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారరథంపై ఎక్కి ర్యాలీగా ఉన్నవకు బయలుదేరారు. ఉదయపురి కాలనీ, సూర్యనగర్‌కాలనీల్లోని చర్చిలో ప్రార్థనలు చేశారు. ఉన్నవ గ్రామంలోని వీధులతో పాటు సూర్యనగర్ కాలనీ, ఉదయపురి కాలనీ, నందుల కాలనీ, సీతారామపురం, గల్లా వారి వీధి, బ్రహ్మంగారి గుడిసెంటర్, యాదవుల బజార్, రామాలయం వీధి, లైబ్రరీ సెంటర్, ఎస్టీకాలనీలోని వీధుల్లో ప్రచార వాహనంపై రోడ్‌షో నిర్వహిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాట్లాడుతూ పేదల పక్షానా జగన్..పెత్తందార్ల వైపు మూడు ప్రతిపక్షపార్టీలు నిలిచాయన్నారు. ఈ పోరాటంలో పేద ప్రజలంతా జగనన్నకు ఆయన బలపర్చిన అభ్యర్థులకు అండగా ఉండి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. మీకు మంచి జరిగితేనే మళ్లీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రతిపక్ష కూటమి అంతా కట్టకట్టుకుని చేసే అసత్య ప్రచారాల్ని నమ్మవద్దన్నారు.

టీడీపీపై నమ్మకం లేకనే ఆపార్టీ నాయకులు సైతం బీజేపీ, జనసేనలోకి వెళ్లడం జరుగుతుందన్నారు. పెత్తందార్ల పార్టీ కుట్రలో భాగంగానే ఒకటోతేదీన ఇవ్వాల్సిన సామాజిక పెన్షన్ డబ్బులు నిలిచాయన్నారు. పెత్తందార్ల కుట్ర బుద్ధిని ప్రజలు గమనించి రానున్న ఎన్నికల్లో పేదల అభ్యున్నతిని కాంక్షించే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పార్టీ మండల అధ్యక్షులు ఘంటా శంకర్, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, జిల్లా పార్టీ విద్యార్థి విభాగం నాయకు లు సిరాజ్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, సర్పంచ్ దంటూ సరళ, వైఎస్ సర్పంచ్ చాగంటి శ్రీధర్, సొసైటీ చైర్మన్ ఓరుగంటి పూర్ణయ్య, నాయకులు గుత్తి సింగయ్య, యల్లంపల్లి శ్రీరామమూర్తి, కాకుమాను విజయ్, గల్లా ప్రభాకర్, నిమ్మగడ్డ జగన్‌మోహన్, యలగాల సాయి, సామినేని రాఘవయ్య, తోకల కోటేశ్వరరావు, గల్లా ప్రభాకర్, ఓరుగంటి రామచంద్రరావు, గంటా రజిని, శ్రీనివాసరావు, మానుకొండ సదాశివరావు, రాజుపాలెం రమణయ్య, దంటూ ఏసోబు, మద్దు విజయసారథి, పుట్ట నాగేశ్వరరావు, తోకల వీరాంజనేయులు, వలేటి ఉదయ్ కిరణ్, కాకుమాను రాఘవ, ఉమామహేశ్వరరావు, పి దయాసాగర్, పందుల బుల్లెబ్బాయ్, కొప్పుల శ్యామేల్‌పాల్, పెదబాబు, వడ్డేపల్లి నరసింహరాజు, ఎంపీటీసీ శ్రీనుబాబు, శ్రీనునాయక్, షేక్ హుస్సేన్, మాదం శ్రీనివాసరావు, ఆలోకం వెంకట లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం నిర్మిస్తాం



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

- జగనన్న పాలనలోనే పనులు ప్రారంభం
- పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు, గౌరవం ఉంటుంది

బొల్లాపల్లి: వరికపూడిశెల ఎత్తిపోతల పథకం వైఎస్సార్ సీపీ సారథ్యంలోనే నిర్మాణం జరుగుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పలు కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలోని అయ్యన్నపాలెం, మర్రిపాలెం, బొల్లాపల్లి గ్రామాల నుంచి పలు కుటుంబాలు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులుగా భావిస్తామని, తగిన గౌరవం, గుర్తింపు ఉంటుందని తెలిపారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి అటవీ శాఖ అనుమతులను తీసుకొచ్చింది వైఎస్సార్ సీపీ పాలనలోనే జరిగిందని, రాబోయే ఎన్నికల్లో పార్టీ తప్పనిసరిగా గెలుస్తుందని, వరికపూడిశెల ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయిలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పేదల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ పాటుపడిందని, జగనన్న పాలనలో సంక్షేమం ప్రతి ఇంట వెల్లువిరిసిందని, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు ప్రతిపేదవాడి దరిచేరాయని గుర్తు చేశారు. ప్రస్తుతం జరగబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోమారు అధికారంలోకి తీసుకు రావాలని, ప్రతిపేదవాడి అభ్యున్నతికి ఆలోచనకు అనుగుణంగా సంక్షేమాభివృద్ధి జరుగుతుందన్నారు. బొల్లాపల్లి మండలంలో తాగు, సాగు నీటి సమస్య శాశ్వత పరిష్కారం వరికపూడిశెలతోనే లభిస్తుందని, ఈ ఎత్తిపోతల పథకం వైఎస్సార్ సీపీతో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి



గురవాయపాలెంలో ఓటరు అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్

నరసరావుపేట రూరల్: ప్రజాస్వామ్యాన్ని గౌరవించే ప్రతిఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.బాలునాయక్ తెలిపారు. మండలంలోని గురవాయపాలెంలో సోమవారం ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటు హక్కు కలిగిన వారందరూ ఎన్నికల్లో తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం, ఓటు ఆవశ్యకతపై నినాదాలు చేస్తూ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం ఓటర్లు, మహిళాసమాఖ్య సభ్యులచే ప్రతిజ్ఞ నిర్వహించారు.

కావటిని అత్యధిక మెజార్టీతో గెలిపించండి

- ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్
- ప్రజలకు సేవ చేసేందుకు ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు
- ఎన్నికల ప్రచారానికి శ్రీకారం



కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్



ప్రచారంలో వృద్ధురాలి నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కావటి మనోహర్ నాయుడు

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కావటి శివనాగ మనోహర్ నాయుడును ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. నియోజక వర్గంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి కావటి మనోహర్ నాయుడు సోమవారం శ్రీకారం చుట్టారు. ముందుగా పట్టణంలోని రజకకాలనీలో ఉన్న ఈశాన్య ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పార్టీ నాయకులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం 9వ వార్డు పరిధిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. తొలిరోజు వార్డు పరిధిలో యువత, మహిళలు అధిక సంఖ్యలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

జగనన్న సైనికుడు కావటి

ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ జగనన్న సైనికుడు కావటి మనోహర్‌నాయుడు అని కొనియాడారు. జగనన్న ఆశయాలు, అభివృద్ధి, సంక్షేమ ఫలాలు కొనసాగించేందుకు ఆయనతో పాటు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌కు పట్టం కట్టాలని కోరారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు రాష్ట్రంలో జగనన్న పాలనలో కొనసాగుతున్నాయని చెప్పారు. సమ సమాజ స్థాపనే లక్ష్యంగా జగనన్న పాలన కొనసాగిస్తున్నారని కొనియాడారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, రైతు భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న చేదోడు, వైఎస్సార్ పెన్షన్ కానుక వంటి పథకాలతో ప్రతి ఇంటికీ మేలు చేకూర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. మరోవైపు సమర్థవంతంగా ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేస్తూ ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారని వెల్లడించారు. ఇంకా అర్బన్‌హెల్త్ సెంటర్లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యాన్ని ఎంతో చేరువ చేశారని పేర్కొన్నారు. దీనికి తోడు దేశంలోనే తొలిసారిగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశ పెట్టి ఇళ్లకు వైద్యులను పంపి చికిత్స అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే సాధ్యమైందని వెల్లడించారు. అదే 2014లో 600 కు పైగా హామీలు ఇచ్చిన చంద్రబాబునాయుడు వాటిని అమలు చేయకపోగా, హామీలను రద్దు చేసి చివరకు ఆన్‌లైన్ నుంచి ఎన్నికల మేనిఫెస్టోను తొలగించిన ఘనుడని విమర్శించారు.

విశ్వసనీయతకు, నమ్మక ద్రోహానికి జరుగుతున్న ఎన్నికల్లో అన్ని హామీలను అమలు చేసే వారికే అండగా నిలవాలని కోరారు. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు ఓ అవకాశం కల్పించారని... దానిని సద్వినియోగం చేసుకొనేందుకు ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్నా, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, వార్డు కౌన్సిలర్ చింతపల్లి విల్సన్, పార్టీ వార్డు అధ్యక్షుడు నకరికంటి శ్రీకాంత్, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

నవోదయకు ఏడుగురు విద్యార్థులు ఎంపిక



రొంపిచర్ల: మండలంలో నవోదయ 2024 ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాల్లో కేరళ మోడల్ స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థుల్లో ఫణిదపు రేవతి, కోట ప్రసిద్ధి, నంబుల సుప్రియ, పుల్లగూర జనీవ, మేరీ జోష్ బాబు, మాణిక్యరావు, విష్ణు తేజ ఉన్నారు. వీరందరినీ ఎంఈవో బ్రహ్మేశ్వరరావు అభినందించారు.

ప్రశాంత వాతావరణంలో ..

రొంపిచర్ల: గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని డీఎస్పీ వి.ఎస్.ఎన్. వర్మ అన్నారు. మండలంలోని తురిమెళ్ల గ్రామంలో సోమవారం రాత్రి గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దన్నారు. అందరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు తగు చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామంలో హింసాత్మక చర్యలకు పాల్పడేవారిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లిఖార్జునరావు, ఎస్ఐ కే.పీ రవీంద్ర బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు గ్రామ సమీపంలో పల్నాడు, ప్రకాశం జిల్లా బోర్డర్‌లో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వే పోలీసు చెక్ పోస్టు వద్ద సోమవారం రాత్రి వాహనాల తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ వి.ఎస్.ఎన్. వర్మ, సీఐ మల్లిఖార్జునరావు, ఎస్ఐ కే.పీ. రవీంద్రబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల జోలికొస్తే ఖబడ్దార్

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు, మాజీ ఎమ్మెల్యేలు మక్కెన, జీవీలకు బీసీ నాయకుల హెచ్చరిక
- బీసీల ఓట్లతో గెలిచి వారినే విమర్శించడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమంటూ హితవు



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

వినుకొండ(నూజెండ్ల): నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్‌పై ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యేలు మక్కెన, జీవీలు చేసిన విమర్శలను రాష్ట్ర బీసీ సంఘం నాయకులు సునిల్ కుమార్ యాదవ్, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ స్వర్ణా వెంకట్రావు, చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులుతో పాటు పలువురు బీసీ సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు సముచిత స్థానం కల్పిస్తూ నరసరావుపేట ఎంపీ సీటు అనిల్‌కుమార్ యాదవ్‌కు కేటాయించారని, అయితే ఇటీవల నెల్లూరు నుంచి ఓ కుక్క వచ్చిందని పరుష పదజాలంతో అనిల్‌కుమార్ యాదవ్‌ను దుర్భాషలాడటాన్ని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తన అనుచరుల చేత ఇలాంటి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. తమ నాయకుడిని కుక్కతో పోల్చారని, కుక్క చాలా విశ్వాసం గల జంతువని, మీరే గుంటనక్కల మాదిరిగా బడుగు, బలహీన వర్గాల ఓట్లతో గెలిచి బీసీలను విమర్శించడమేమిటని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో బీసీలంతా ఐక్యతగా ఉండి ఓట్ల రూపంలో తమ సత్తా చాటుతామని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే గ్రామాల్లో తిరగనివ్వమని అన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎంపీగా అవకాశం కల్పించారని, రాజకీయ భిక్ష పెట్టినవారికి వెన్నుపోటు పొడిచి రెండేళ్ల నుంచి చంద్రబాబుతో సన్నిహితంగా ఉంటూ రాజకీయ విలువలకు నీళ్లు వదిలారన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు మక్కెన మల్లికార్జునరావు, జీవీ ఆంజనేయులు కూడా కేవలం ఒక సామాజిక వర్గం ఓట్లు వేస్తే గెలవలేదని, బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ ఓట్లతోనే గెలిచారని గుర్తుపెట్టుకోవాలన్నారు. బీసీ అయిన జంగా కృష్ణమూర్తి రాజకీయ భవిష్యత్‌ను కూడా లావు శ్రీకృష్ణదేవరాయలు నాశనం చేశారని, ఇలాంటి నాయకులకు బీసీలు సరైన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి నాలుగు కుటుంబాలు

శావల్యాపురం: మండల కేంద్రానికి చెందిన నాలుగు కుటుంబాలు టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్ సీపీ చేరినట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ భీమని అంకారావు సోమవారం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యాగసిని చెన్నమ్మ,ఏసురాజు, ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, బీసీ మండల నాయకులు పోట్లూరి ఏడుకొండలు, లింగాల కోటేశ్వరరావు,సుబ్బారావు, పోట్లూరి మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది



బొల్లాపల్లి: ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్, ఏఆర్వో బి.వి.రమణారావు తెలిపారు. మండల కేంద్రంలో ఓటు హక్కుపై పౌరులకు సోమవారం అవగాహన కల్పించారు. గ్రామవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రధానకూడలిలో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. దృఢమైన, చైతన్యవంతమైన ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది, పవిత్రమైనది, వజ్రాయుధమని ఏఆర్వో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దివ్యాంగులు, 85 సంవత్సరాలు నిండిన ఓటర్లకు హోం ఓటింగ్ సదుపాయం కల్పించామని తెలిపారు. ఓటును స్వేచ్ఛగా వేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీస్ భద్రత ఉంటుందని, శాంతియుతంగా, స్వేచ్ఛగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఈసీ వి.ఎ.విజయ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎస్‌కే జిలానీబాషా, ఎస్ఐ డి.చెన్నకేశవులు, బీఎల్‌వోలు, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): ఓటు హక్కుపై నూజెండ్ల గ్రామంలో స్వీప్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల అధికారులు పాల్గొని విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు యొక్క విలువ, ఓటు వేయకపోవడం వల్ల జరిగే నష్టం గురించి వివరించారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దార్, ఎస్‌కే నయీమ్ అహమ్మద్, ఎంపీడీవో వీరభద్రాచారి, ఐనవోలు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి, ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజాము చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని కుమ్మరకాలనీకి చెందిన రామకృష్ణ(32) మిత్రుడు డేనియల్‌తో కలసి ద్విచక్రవాహనంపై విజయబ్యాంకు సమీపంలో జాతీయ రహదారి దాటుతున్నారు. ఈ క్రమంలో ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న రామకృష్ణ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది గాయపడిన డేనియల్, లారీ డ్రైవర్ షేక్ దరియావలిని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

తాగునీటి చలివేంద్రాలు ఏర్పాటు

నరసరావుపేట: వేసవి ఎండలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున పట్టణంలో ఉచిత మంచి నీటి చలివేంద్రాలు అధికంగా ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి ఆదేశించారు. సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, అడ్మినిస్ట్రేషన్ విభాగ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పుర ప్రజలకు ప్రతి ఏడాది చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందులో భాగంగా ఈసారి ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున పట్టణ ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలను దృష్టిలో పెట్టుకొని వారి దాహార్తిని తీర్చేందుకు ఎక్కువ సంఖ్యలో చలివేంద్రాలు ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే పారిశుద్ధ్య పట్టణంలో ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉన్నందున అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశానికి మున్సిపల్ ఇంజనీర్ కనకారావు, మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ ఓలేటి శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సి.నరసింహా రావు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ నాయక్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, రామకోటయ్య పాల్గొన్నారు.